క్లుప్తంగా

భారీ అన్న సమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న నాయకులు అప్పారావు, శ్రీను

పెదగంట్యాడ: దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని భానోజీకాలనీలో విజయదుర్గ యూత్ క్లబ్ ప్రతినిధి యాదగిరి ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుల మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

రక్తదాన శిబిరం బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జస్టిన్ ఫ్రెండ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డులో ఈ నెల 18న కాకి కుంచారావు (జస్టిన్) ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి తెలిపారు. రక్తదాన శిబిరం బ్రోచర్‌ను బుధవారం జస్టిన్ ఫ్రెండ్స్ ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. అమ్మ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించనున్న శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాకి కిట్టు, వాకాడ ప్రసాద్ రెడ్డి, వెంపాడ మనుమణి, కాకి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

సినర్జీస్ కంపెనీలో కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న సినర్జీస్ కార్మికులు

అగనంపూడి: సినర్జీస్ కార్మికులు జీతాల కోసం బుధవారం ధర్నా చేశారు. కంపెనీ ముందు నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ నాయకుడు ఎం. రాంబాబు మాట్లాడుతూ సినర్జీస్ యాజమాన్యం ఆరు నెలలుగా జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వేతనాలు అడిగితే పని నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారన్నారు. కంపెనీలో 950 మంది కార్మికులు 20 ఏళ్లుగా పని చేస్తున్నా భద్రత లేకుండా పోయిందన్నారు. ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి 10 గంటల వరకు ధర్నా జరిగింది. సమస్య పరిష్కరించకపోతే గురువారం ఉదయం ధర్నా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో దత్తాత్రేయ నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో సినిమా షూటింగ్



లొకేషన్‌లో హీరో నాగశౌర్య

కొమ్మాది: బీచ్‌రోడ్డులో హీరో నాగశౌర్య నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ జరిగింది. ఉప్పాడ, ఎంవీపీ కాలనీల్లో బుధవారం షూటింగ్ నిర్వహించినట్లు చిత్రం యూనిట్ సభ్యులు తెలిపారు. నాగశౌర్యపై ఇప్పటికే సింహాచలం, భీమిలి, ఆర్కే బీచ్ ప్రాంతాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించినట్లు చెప్పారు. భీమిలి–విశాఖ పరిసర ప్రాంతాల్లో మరో నాలుగు రోజులు పాటు ఈ సినిమా చిత్రీకరణ ఉంటుందన్నారు.



గ్రామం వైపు చెరువును ఆక్రమించి ఏర్పాటు చేసిన రోడ్డు



కృష్ణ మహంతి చెరువు

చెరువును మింగేస్తున్నారు!

డెబ్రిస్‌తో కప్పేస్తున్న వైనం • 5 ఎకరాల వరకూ ఆక్రమణ • కళ్లెదుట కనిపిస్తున్నా పట్టించుకోని యంత్రాంగం

అక్కిరెడ్డిపాలెం: గాజువాకకే తలమానికమైన 69వ వార్డు నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువుపై కబ్జాదారుల కన్నుపడింది. అనుకున్నదే తడువుగా డెబ్రిస్‌తో చెరువు గర్భాన్ని కప్పేస్తున్నారు. దీనికి వెనుక బడాబాబుల హస్తం ఉండడంతో అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కబ్జాకు గురైన చెరువు విస్తీర్ణం సుమారు 3 నుంచి 5 ఎకరాలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.



గ్రామం వైపు నుంచి చెరువును ప్రణాళిక ప్రకారం చదును చేస్తున్న దృశ్యం

ఇదీ పరిస్థితి

గ్రామంలో 18 ఎకరాల విస్తీర్ణంలో కృష్ణ మహంతి చెరువు ఉంది. గతంలో ఈ చెరువు నుంచి దిగువన ఉన్న వ్యవసాయ పొలాలకు సాగునీరు వెళ్లేది. నగరం విస్తరించడంతో వ్యవసాయ భూముల్లో ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లు వెలిశాయి. దీంతో ఈ నీటి వినియోగం తగ్గింది. రైతులు పట్టించుకోక పోవడంతో చెరువు గుర్రపు డెక్కతో నిండిపోయింది. మరో వైపు ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారుల కన్ను చెరువుపై పడింది.

అసలు చెరువు విస్తీర్ణం తెలుసా..

కృష్ణ మహంతి చెరువు విస్తీర్ణం అధికారులకు తెలుసా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కబ్జా కాగా మిగిలిన చెరువు విస్తీర్ణం సుమారు 12 నుంచి 14 ఎకరాలు ఉంటుందని అంటున్నారు. చెరువు ఆక్రమణ గురించి పట్టించుకోకుండా హఠాత్తుగా చెరువు వద్ద కొత్త బోర్డు దర్శనమివ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ బోర్డు కబ్జాదారులు పెట్టారా..? అధికారులు ఏర్పాటు చేశారా అన్నది తేలడం లేదు. ఒక వేళ అధికారులు ఏర్పాటు చేస్తే ఆక్రమణకు గురైన చెరువు భూభాగం కనిపించలేదా? అని ప్రశ్నిస్తున్నారు. మట్టిరోడ్డుతో పాటు తుప్పలు మొలిచిన వైపు ఎందుకు విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేశారో అని చర్చసాగుతోంది.

ప్రణాళికాబద్ధంగా కబ్జా

కొందరు బడాబాబుల దన్నుతో కబ్జాదారులు ప్రణాళిక ప్రకారం చెరువు ఆక్రమణకు తెరతీశారు. గ్రామం వైపు నుంచి చెరువు గర్భాన్ని డెబ్రిస్‌తో కప్పుతూ వచ్చారు. అంతటితో ఆగకుండా చెరువుకు గట్టు ఏర్పాటు చేసి దాన్ని రహదారిగా చిత్రీకరించారు. తర్వాత మెల్లగా గ్రామం వైపు నుంచి సుమారు 3 నుంచి 5 ఎకరాల మేర చెరువును కప్పుతూ వచ్చారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కబ్జాపై దృష్టి సారించలేదు. కబ్జాదారులకు ఒక వైపు రాజకీయ నాయకుల అండదండలు, మరో వైపు అధికారుల సహకారం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పోరాటానికి గ్రామస్తులు సన్నద్ధం

కోట్లాది రూపాయల విలువైన కృష్ణ మహంతి చెరువు ఆక్రమణలపై అధికారులు నిగ్గు తేల్చక పోతే త్వరలో పోరుబాట పడతామని గ్రామస్తులు చెబుతున్నారు. తొలుత జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి ఆయన సమక్షంలో చెరువును సర్వే నిర్వహించాలని కోరుతామంటున్నారు. కబ్జా అంశంపై వ్యక్తిగతంగా నోరు విప్పడానికి స్థానికులు భయపడుతున్నారు.



చెరువు గర్భంలో డెబ్రిస్‌ను చదును చేస్తున్న దృశ్యం

శోకసంద్రంలో కొండయ్యవలస

- సాత్విక్ మృతదేహం లభ్యం
- అంత్యక్రియలు పూర్తి



సాత్విక్ (ఫైల్)

అగనంపూడి: ఒడిశాలోని కుసకుంద నదిలో అదృశ్యమైన అగనంపూడికి చెందిన కంచిపాటి సాత్విక్ మృతదేహం రెండున్నర రోజుల తర్వాత మంగళవారం సాయంత్రం లభ్యమైంది. మంగళవారం సాయంత్రం అక్కడి బయల్దేరి బుధవారం ఉదయం అగనంపూడిలోని కొండయ్యవలస తీసుకువచ్చారు. బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు శోకసంద్రం మధ్యలో అంత్యక్రియలు పూర్తి చేశారు. అదృశ్యమైన సాత్విక్ బతికే ఉండి ఉంటాడని ఆశతో ఎదురు చూసినా ఫలితం దక్కకపోవడంతో తల్లిదండ్రులు, అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలు ఇతర బంధువులు బోరున విలపిస్తున్నారు. అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసకు చెందిన కంచిపాటి నరసింహమూర్తి కుమారుడు సాత్విక్ దసరా సెలవులకు మేనమామ ఇంటికి ఒడిశాలోని సుందర్‌ఘర్ వెళ్లి ఆదివారం విహార యాత్రకు వెళ్లి నదిలో అదృశ్యమైన సంగతి విధితమే.

శిశుగృహ పరిశీలన



శిశుగృహ వద్ద వేంకటశేషమ్మ, తదితరులు

మర్రిపాలెం : డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ బుధవారం శిశుగృహను సందర్శించారు. అక్కడి పరిస్థితులను గమనించి, అందుతున్న సదుపాయాలు పరిశీలించారు. ఆమెతోపాటు ప్రాజెక్టు డైరెక్టర్ జి.జయాదేవి, మేనేజర్ ఎ.సుజాత, సోషల్ వర్కర్ ఎస్‌వీఎస్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం



చిత్తడిగా మారిన రైతుబజార్ ఆవరణ



కేకేఆర్ వాటర్ ప్లాంట్ ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



నడుపూరు నుంచి గాంధీనగర్ వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

పెదగంట్యాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండలంలో బుధవారం ఉదయం, సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు, గెడ్డలు పొంగిప్రవహించారు. రోడ్లు చెరువులను తలపించాయి. ఉదయం నుంచి ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో భారీగా వర్షం పడింది. తర్వాత తెరిపిచ్చింది. ఆపై ఎండ తీవ్రంగా కాసింది. సాయంత్రం మళ్లీ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. జోరు వాన కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. రోడ్లన్నీ జలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆట స్థలాలు, రైతుబజార్ ఆవరణ బురదమయం కావడంతో క్రీడాకారులు, కొనుగోలుదారులు ఇక్కట్లు పడ్డారు.

వైభవంగా దుర్గాదేవి అనుపు ఉత్సవం



దుర్గాదేవి అనుపు ఉత్సవంలో సందడి



దుర్గాదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా ముగిశాయి. జీవీఎంసీ 75వ వార్డు గొందేశి వీధిలో పెంటమాంబ యువ జన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహంగా ముగిశాయి. దుర్గాదేవి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఇందులో భాగంగా మహిళలు అష్ట దుర్గలు వేషధారణలో ఆకట్టుకున్నారు. డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతోపాటు కోలాటం, సాము గరిడీలు, పులివేషాల మధ్య అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతుండటంతో వాతావరణం క్షణక్షణానికి మారిపోతోంది. కాసేపు వర్షం కురుస్తోంది. మరికాసేపు ఎండ కాస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం మధ్యాహ్నం ఆకాశం వెండి మబ్బులతో నిండిపోయింది. ఈ అద్భుత దృశ్యం స్టీల్ ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం నుంచి కనిపించింది. - ఉక్కునగరం

విజ్ఞాన్ అధ్యాపకులకు అవార్డులు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు పలు విభాగాల్లో ఉత్తమ అధ్యాపక అవార్డులు లభించాయి. నీతి అయోగ్ ద్వారా నమోదు చేసిన కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాంపిటెన్సీ (సీఎస్‌సీ) ఈ అవార్డులను ప్రదానం చేస్తుంది. ఇందులో భాగంగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్‌కు, బెస్ట్ టీచర్ ఆఫ్ ది ఇయర్ ఎక్స్‌లెన్సీ ఇన్ టీచింగ్ అవార్డు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.రవీంద్రకు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ బొడే ప్రసాద్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ స్టూడెంట్స్ ప్లేస్‌మెంట్ అండ్ కెరియర్ డెవలప్‌మెంట్ అవార్డు దక్కించుకున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉత్తమ సహకారం అందించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.స్రవంతికి ఉత్తమ సలహాదారునిగా, ప్రొఫెసర్ కె.దుర్గా శ్యామ్ ప్రసాద్‌కు ఉత్తమ ఇన్నోవేటివ్ పెడగోజీ అవార్డులు అందుకోనున్నట్టు రెక్టార్ వి.మధుసూదనరావు తెలిపారు.

అంతర్జాతీయ మారథాన్‌లో విశాఖవాసుల ఘనత



చికాగో మారథాన్‌లో సత్తా చాటిన వైజాగ్ రన్నర్స్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్

బీచ్‌రోడ్డు: అమెరికాలోని చికాగో నగరంలో ఇటీవల నిర్వహించిన బ్యాంక్ ఆఫ్ అమెరికా చికాగో మారథాన్‌లో వైజాగ్ రన్నర్స్ సొసైటీ సభ్యులు సత్తా చాటారు. ఈ పోటీలో ప్రపంచ దేశాల నుంచి వేలాది మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ సెక్రటరీ కె.శ్రీనివాస్, అరవింద్, ప్రియ మాథుర్, రాజేంద్ర పాల్గొని నిర్ణీత సమయం కన్నా ముందే గమ్యాన్ని చేరుకొని ఘనత సాధించారు. విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన వీరిని సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ రాయ్, ఇతర సభ్యులు అభినందించారు. సహచర సభ్యుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ట్రైనింగ్ సెషన్లు నిర్వహిస్తోందని, నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సభ్యులు కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచితే సెయిల్‌లో విలీనం



మాట్లాడుతున్న రామస్వామి

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో బుధవారం చేపట్టిన 1343వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకు కూడా అందుబాటులో ఉంచడం లేదని ఆరోపించారు. ఫలితంగా ఏటా నష్టాలు చవిచూడాల్సి వస్తుందని, దీనికి కార్మికులను మానసికంగా వేధించడం, ఆర్థిక ప్రయోజనాల్లో కోతపెట్టడం దారుణమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎన్.రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, భానుమూర్తి, పెదిరెడ్ల నీలకంఠం, గంగాధర్, వెంకట్రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెంలో ఖోఖో పోటీలు నేడు

అగనంపూడి: ఉమ్మడి విశాఖ జిల్లా ఖోఖో అండర్–14 (బాలురు, బాలికలు) ఎంపికలు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించనున్నట్టు ఎస్‌జీఎఫ్ విశాఖ, అనకాపల్లి, ఏఎస్‌ఆర్ జిల్లాల కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు తెలిపారు. వాస్తవంగా ఈ పోటీలు అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించాల్సి ఉండగా, వర్షాల కారణంగా లంకెలపాలెం హైస్కూల్‌కు మార్చాల్సి వచ్చిందని పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన వారు ఉదయం 9గంటలకు లంకెలపాలెం హైస్కూల్‌కు చేరుకొని సకాలంలో పూర్తయ్యేలా సహకరించాలని వారు కోరారు.

బాస్కెట్‌బాల్ ఎంపికలు వాయిదా..

గురువారం జరగాల్సిన బాస్కెట్ బాల్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలు వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్టు తెలిపారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం



ఉక్కు స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో సాధన చేస్తున్న ప్రజలు

ఓపెన్ జిమ్‌లకు క్యూ కడుతున్న ప్రజలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లకు ప్రజలు క్యూ కడుతున్నారు. ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం ఉండడంతో చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా అంతా వినియోగిస్తున్నారు. వాకింగ్ పూర్తయిన తర్వాత జిమ్ పరికరాలతో వ్యాయామం చేస్తున్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా 78 వార్డు పరిధిలోని ఉక్కు టౌన్‌షిప్‌లో ఓపెన్ జిమ్‌లకు ఆమోదం లభించింది. సుమారు రూ.40 లక్షల వ్యయంతో ఉక్కునగరంలోని ఎనిమిది చోట్ల ఈ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఉక్కు స్టేడియం, త్రిష్ణా మైదానం, అంబేద్కర్ పార్కు, మహాత్మా గాంధీ పార్కు, గుర్రం జాషువా పార్కు, సెక్టార్–11 పార్కు, సీఐఎస్ఎఫ్ కాలనీ, అగనంపూడి రహదారిలోని వాకింగ్ పార్కులో ఈ జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వివిధ సెక్టార్లలో పార్కులు ఏర్పాటు చేసింది. ఆరోగ్యంపై అవగాహన పెరిగిన సమయంలో ఈ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు ఉదయం, సాయంత్రం వచ్చి ఉత్సాహంగా గడుపుతున్నారు.



త్రిష్ణా మైదానంలోని జిమ్

ధరలు తగ్గించాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: సామాన్యులపై ఆర్థిక భారం పడుతున్న నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జోన్ ఆరిలోవ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ కూడలిలో ధర్నా చేపట్టారు. అనంతరం అంబేద్కర్ కూడలి నుంచి పాత ఆరిలోవ మీదుగా బాలాజీనగర్ వరకు ర్యాలీ చేశారు. పెరిగిన ధరలు అదుపు చేయాలని, పెరిగిన ధరలకు హద్దే లేదా అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె.రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు క్షేత్రపాలు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెంచి వారిపై మోయలేని ఆర్థిక భారం వేస్తోందని మండిపడ్డారు. ప్రజలు నిత్యావసర సరకులు కొనలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం కాలం గడుపుతోందని విమర్శించారు. ఉచిత ఇసుక ఇవ్వడం లేదు సరికదా.. ఎన్నడూలేని ధరలకు ఇసుక అమ్ముకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవుడమ్మ, లక్ష్మణరావు, కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార : చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యం కాపాడుకోవచ్చని మేజిక్ బస్ సంస్థ ట్రైనింగ్ కమ్ మోనిటరింగ్ ఆఫీసర్ సురేంద్ర అన్నారు. గ్లోబల్ హ్యాండ్‌వాష్ డేను పురస్కరించుకుని పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎన్‌ఎంసీహెచ్)లో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం ముందు, తర్వాత... వాష్ రూమ్‌కి వెళ్లిన తర్వాత, ఆటలు ఆడిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతులు అపరిశుభ్రంగా ఉంటే బ్యాక్టీరియా కడుపులోకి వెళ్లి పలు రోగాలకు కారణమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పైడి, పడమ్మలు, ప్రధానోపాధ్యాయుడు రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.